ఘనంగా తీజ్ వేడుకలు



తీజ్ వేడుకల్లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: బంజారాల సంప్రదాయ ఉత్సవం తీజ్ వేడుకలను గురువారం చర్లపల్లి డివిజన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి హాజరై వేడుకల్లో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు బంజారాలు సాంప్రదాయ పద్ధతుల్లో ఘనంగా సత్కరించారు. అనంతరం మహిళల ఆటపాటలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రభుగౌడ్, నవనీతరెడ్డి, అరుణ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

‘రక్తహీనత సమస్యను నివారించవచ్చు’



మాట్లాడుతున్న డా. కరుణకుమార్

మల్కాజిగిరి: బాలికలు, యువతుల్లో రక్తహీనత అనే ఆరోగ్య సమస్య నివారించవచ్చని డాక్టర్ కెకె క్యాన్సర్ కేర్ అండ్ సపోర్ట్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డా. కె.కరుణకుమార్ అన్నారు. గురువారం సెయింట్ ఆన్స్ స్కూల్‌లో రక్తహీనత నివారణ నియంత్రణకు ఉచిత స్క్రీనింగ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ.. చిన్నతనం నుంచే తగినంత పోషకాహారాన్ని తీసుకోవడం వల్ల రక్తహీనత భారినపడకుండా ఉంటామన్నారు.

కార్మికుల హక్కుల కోసం బీఎంఎస్ నిరంతర పోరాటం

మేడిపల్లి: కోల్ ఇండియా, సింగరేణి బొగ్గు గనుల కార్మికుల హక్కుల కోసం భారత మజ్దూర్ సంఘ్ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి ప్రొవిడెంట్ ఫండ్ సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం పీర్జాదిగూడలో జరిగిన సింగరేణి పెన్షనర్ల వెల్ఫేర్ అసోసియేషన్ ద్వితీయ వార్షిక మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. సింగరేణిలో పదవీవిరమణ పొందిన కార్మికులకు కనీస పెన్షన్ రూ.5 వేలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసరా పెన్షన్‌ను అందించాలని, మరోవైపు కార్మికుల ఆరోగ్యం కోసం హైదరాబాద్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, మెడికల్ ఔట్‌లెట్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్,పెన్షన్ వెల్ఫేర్ ప్రతినిధి రమాకాంత్, ఆల్‌ఇండియా ఫెడరేషన్ కార్యవర్గసభ్యుడు రాజారెడ్డి, రవీందర్‌రావు, ఉమాకర్, కొమురయ్య, బాలయ్య తదితరులున్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



అల్వాల్: నేరేడ్‌మెట్ ఆర్‌కేపురంలోని ఆర్మీ పబ్లిక్ స్కూల్‌లో గురువారం ఇన్వెస్టిచర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయుధ కేంద్రం కమాండెంట్ బ్రిగేడియర్ షైలేంద్రసింగ్ హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలన్నారు. స్కూల్ అభివృద్ధిలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి ఎంతో గొప్పదన్నారు. అనంతరం విద్యార్థి ప్రతినిధులకు బ్యాడ్జీలను అందించి వారితో ప్రమాణస్వీకారం చేయించారు. సిమీసింగ్, స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు అర్చనారాయ్ తదితరులున్నారు.

రామంతాపూర్ రోడ్డుపై వరద ప్రవాహం



రామంతాపూర్ : భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం కాగా.. వరద నీరు రోడ్లపై ప్రవహించడంతో వాహనాలు కొట్టుకుపోయాయి. గురువారం కురిసిన వర్షానికి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రామంతాపూర్ సత్యనారాయణస్వామి దేవాలయం, కేసీఆర్‌నగర్, బైపాస్ రోడ్డు, శ్రీనివాసపురం, చర్చి కాలనీ, వివేక్‌నగర్, నెహ్రూనగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై వరదలు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పనులు పూర్తయ్యేదెప్పుడు ?

కొనసాగుతున్న కావేరినగర్ నాలా రోడ్డు పనులు ● జీహెచ్ఎంసీని ముట్టడిస్తామంటున్న కాలనీవాసులు



కావేరినగర్ నాలా వద్ద మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఉప్పల్: కావేరినగర్ రోడ్డు పనులను జాప్యం కారణంగా స్థానిక కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 15 రోజుల్లో పూర్తిచేయాల్సిన పనులను నెలల కొద్ది సాగతీయడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ మరింత నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో నిత్యం వేలాదిమంది అనేక ఇబ్బందులు పడుతున్నారు.

పెరుగుతున్న దూరభారం..

ఉప్పల్ రింగ్ రోడ్డు నుంచి చిలుకానగర్‌తో పదుల సంఖ్యలో కాలనీలు, నాచారం, మల్లాపూర్, ఈసీఐఎల్, ఎన్ఎఫ్‌సీ తదితర పరిశ్రమలు వెళ్లే కార్మికులు, ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. 100 మీటర్ల మార్గం మూసివేయడంతో దాదాపుగా 3–4 కిలో మీటర్ల మేర చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు. రోడ్డును తవ్వి వదిలేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు.

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం..

నిత్యం వేలాది వాహనాల రాకపోకలతో బిజీగా ఉండే రోడ్డును మూసేయడంతో ఒక్కసారిగా రోడ్డు బోసి పోయింది. కేవలం వర్షం సాకుతో కాంట్రాక్టర్ పనులను సాగతీస్తున్నట్లు అధికారులే స్వయంగా చెప్పడం శోచనీయం.

మూడు నెలలు పట్టొచ్చు..

నెల రోజుల క్రితం ప్రారంభించిన రోడ్డు మరమ్మతు పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉండటంతో పూర్తి కావడానికి 2–3 నెలలు పట్టొచ్చని అధికారులు అంచనాకు వచ్చారు. అలానే జరిగితే కాలనీల ప్రజలతో జీహెచ్ఎంసీని ముట్టడిస్తామని స్థానిక కాలనీ సంఘాలు హెచ్చరిస్తున్నాయి

నిలిచిపోయిన ఆర్టీసీ సేవలు

కావేరీనగర్ నాలా వద్ద రోడ్డు కుంగిపోవడంతో కాలనీలకు ఆర్టీసీ సేవలు సైతం నిలిచిపోయాయి. ఇంటికి వెళ్లాలంటే అరగంట నడవాల్సి వస్తుంది. ఇరుకు రోడ్ల నుంచి బస్సులు వెళ్తుంటే నిత్యం ట్రాఫిక్‌తో ఇబ్బంది కలుగుతోందని స్థానికులు వాపోతున్నారు.

నెల రోజుల్లో పూర్తి చేస్తాం

పనులను దశలవారీగా పూర్తి చేస్తున్నాం. కచ్చితమైన సమయం చెప్పలేకపోతున్నాం. మరో నెలరోజులు సమయం పట్టొచ్చు.

– హరిలాల్, ఉప్పల్ సర్కిల్ ఈఈ

జాప్యం జరిగితే జీహెచ్ఎంసీని ముట్టడిస్తాం



నిత్యం వేలాది మంది ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వ్యాపారులు సైతం తీవ్రంగా నష్టపోతున్నారు. తిరిగి వెళ్లాలన్నా.. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. చర్చి నుంచి ఉప్పల్‌కు వెళ్లాలంటే దాదాపు 45 నిమిషాలు పడుతోంది. ఇలాగే పనులను జాప్యం చేస్తే అన్ని కాలనీలతో కలిసి జీహెచ్ఎంసీని ముట్టడిస్తాం.

– శ్రీధర్ గుప్తా, సెవెన్ హిల్స్ కాలనీ

అన్ని రకాల చర్యలు తీసుకుంటాం



కాంట్రాక్టర్ అధికారుల నిర్లక్ష్యంతో నిర్మాణ పనులు నత్తనడకన నడుస్తున్న మాట వాస్తవమే. స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తే గురువారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించాం. రూ.17 లక్షలతో చేపట్టిన రోడ్డు మరమ్మతు పనులు గత నెలలో ప్రారంభించారు. పనులు పూర్తయ్యేలా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

– బన్నాల గీత, కార్పొరేటర్

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: సీసీరోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. ఎస్వీనగర్, బాబానగర్‌కాలనీలో రూ.51 లక్షలతో చేపట్టిన సీసీరోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. భూగర్భ డ్రైనేజీ చాంబర్ల ఏర్పాటు, వరదనీరు నిల్వకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. డీఈ రూప, ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, కాలనీ అధ్యక్షుడు నెమలి రవికుమార్, వెంకటేష్, రవిచారి, శ్రీనివాస్‌రెడ్డి స్థానిక నేతలు శ్రీనివాస్‌గౌడ్, శ్రీశైలం, రాపోలు శ్రీను పాల్గొన్నారు.

తల్లిపాలతోనే పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డా. రమేష్‌బాబు

మల్లాపూర్: ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో పిల్లల విభాగాధిపతి, డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తల్లిపాలతోనే పిల్లలు ఆరోగ్యవంతులుగా తయారవుతారన్నారు. పుట్టిన పిల్లలకు కనీసం 6 నెలలు తప్పని సరిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్, ఇతర క్యాన్సర్లు రావని పిల్లలు మానసిక శారీరక ఆరోగ్యం కలిగి సంపూర్ణ ఆరోగ్యంతో పెరుగుతారన్నారు.

అన్నార్తులు ఉన్నచోటే రూ.5 భోజన శిబిరం ఏర్పాటు



కాలనీవాసులతో కార్పొరేటర్ సునీత

మౌలాలి: డివిజన్ పరిధిలోని సుధానగర్ ప్రధాన రహదారిపై రూ.5 భోజన శిబిరం ఏర్పాటు చేయడాన్ని సుధానగర్, వీవీఆర్ గార్డెన్ అపార్ట్‌మెంట్ వాసులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గురువారం చేపట్టిన నిరసన కార్యక్రమానికి కార్పొరేటర్ సునీత మద్దతు ప్రకటించారు. ఈ ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకునేవారే అధికంగా ఉన్నారని, నిరుపేదలు ఉండే చోట శిబిరం ఏర్పాటు చేస్తే వారి ఆకలి తీరుతుందన్నారు. సంబంధిత అధికారుల ఏకపక్ష నిర్ణయాలు సరికాదని, తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని స్పష్టం చేశారు. దీనిపై త్వరలోనే సంబంధిత ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందిస్తానని వివరించారు.

వేర్వేరు ఘటనల్లో గుర్తు తెలియని ఇద్దరి మృతి

మల్కాజిగిరి: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కొండలు తెలిపిన వివరాల ప్రకారం.. వసంతపురికాలనీకి చెందిన జలంధర్ గురువారం మధ్యాహ్నం తన ఇంటి ముందు గుర్తు తెలియని వ్యక్తి (58) పడి ఉండటాన్ని గమనించి పోలీసులకు 100 ద్వారా సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఎడమ చేతిపై రేణుక నర్సయ్య అనే పేరుతో పచ్చబొట్టు ఉందని ఆచూకీ గుర్తించిన వారు పోలీస్‌స్టేషన్‌లో సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు.

మరోచోట..



మల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై మైబెల్లి తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్ డివిజన్ పరిధిలోని దుర్గానగర్‌లో యాచకుడు (55) మృతిచెంది ఉన్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సంబంధీకులు నాచారం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

మల్లాపూర్: దొంగతనాలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని నాచారం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ మీర్‌పేట్‌కు చెందిన విజయ్‌కుమార్‌గౌడ్ (37) జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. గతంలో కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వాహనాన్ని దొంగిలించాడు. మల్లాపూర్ పోచమ్మ ఆలయం, పాన్‌షాప్ దొంగతనానికి పాల్పడ్డాడు. అనుమానాస్పదంగా తిరుగుతున్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

పార్టీ పటిష్టతకు నిరంతరం కృషి



ఢిల్లీలో సీఎం రేవంత్‌రెడ్డితో గడ్డం రవికుమార్

ఉప్పల్: ఢిల్లీలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు ఉప్పల్ రామంతాపూర్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత గడ్డ రవికుమార్‌తో పాటు పలువురు నేతలు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా ధర్నా అనంతరం సీఎం రేవంత్‌రెడ్డిని రవికుమార్ కలిశారు. పార్టీని మరింత పటిష్టం చేసేందుకు నిరంతరం కృషి చేయాలని సూచించినట్లు చెప్పారు.

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



నాచారంలో కురుస్తున్న వర్షం



ఉప్పల్ ఆదిత్య ఆసుపత్రి వద్ద..

దంచి కొట్టిన వాన

మల్లాపూర్: లోతట్టు ప్రాంతాలైన మల్లాపూర్ భవానీనగర్, న్యూ భవానీనగర్, గ్రీన్‌హిల్స్ కాలనీ, నాచారం వీరారెడ్డినగర్, అంబేడ్కర్‌నగర్, రాఘవేంద్రనగర్, ఇందిరానగర్ జలమయమయ్యాయి. భారీ వర్షం పడటంతో వరదనీరు రోడ్లపై వచ్చి చేరింది.

రహదారులు జలమయం..

ఉప్పల్: రెండు గంటల పాటు కురిసిన వర్షంతో ఉప్పల్ పరిసర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. వరంగల్ జాతీయ రహదారిపై గుంతలు ఉండటంతో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయింది. ఎన్‌డీఆర్ ఆఫ్ బృందాలు రంగంలోకి దిగి వరద ప్రవాహాన్ని మళ్లించే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. ఎట్టకేలకు 2 గంటల తర్వాత వర్షం తగ్గుముఖం పట్టడంతో ప్రవాహం తగ్గింది.

అనుబంధాలకు ప్రతీక రక్షా బంధన్



కమిషనర్‌కు రాఖీ కడుతున్న విద్యార్థులు



రాఖీలు కట్టుకుంటున్న చిన్నారులు

బోడుప్పల్: అన్నదమ్ములు, అక్క చెల్లెల మధ్య ప్రేమ, అనుబంధాలకు ప్రతీకగా రక్షాబంధన్ నిలుస్తుందని బోడుప్పల్ కమిషనర్ శైలజ అన్నారు. చెంగిచర్ల విద్యాజ్యోతి ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం ఆమెకు రక్షాబంధన్ కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తోడపుట్టిన వారి మధ్య ఉన్న అనుబంధం, ప్రేమ, ఆప్యాయతను పంచుతుందన్నారు. వేదిక్ మ్యాథ్స్ మాస్టర్ రామారావు, టీచర్ పద్మశ్రీ, పీఈటీ భాస్కర్, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లాపూర్: ఆత్మీయతకు,అనుబంధాలకు ప్రతీక, సోదర భావానికి వేదిక రక్షాబంధన్ అని డెక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణ అక్కినేని అన్నారు. నాచారం అన్నారు. గురువారం పాఠశాలలో ముందస్తుగా రాఖీ వేడుకలను నిర్వహించారు.విద్యార్థులు ఒక్కరికి ఒక్కరూ రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ నవనీతా రావు, మేనిజింగ్ డైరెక్టర్ నవీన్‌కుమార్, డైరెక్టర్ డాక్టర్ కమలా మనోహర్‌రావు, కిషోర్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

కుషాయిగూడ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కార్పొరేటర్ ప్రభుదాస్ అన్నారు. గురువారం మీర్‌పేట్–హెచ్‌బీ కాలనీ డివిజన్, తిరుమలనగర్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటల్లో వినియోగిస్తున్న సరుకులను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందేలా చూడాలన్నారు. స్కూల్ హెచ్ఎం. శ్రీనివాస్, ఉపాధ్యాయులు జానకీకుమారి, శాంతాబాయి, అరుణదేవి, మాధవి, దేవి, సరిత, కృష్ణమూర్తి, పద్మ, కవిత, అనితతో పాటుగా కాలనీ అధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మురళీచారి, నిసార్ అహ్మద్ గోరి తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఐ కాంట్రాక్ట్ కార్మికుల జీతాలు చెల్లించాలి



నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో ధర్నా చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

మల్లాపూర్: నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేసే కాంట్రాక్ట్ నర్సింగ్ సిబ్బంది, టెక్నీషియన్లు, వార్డ్‌బాయిలు, శానిటేషన్, సెక్యూరిటీ కార్మికుల 4 నెలల జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహా డిమాండ్ చేశారు. గురువారం కార్మికులకు 4 నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నెలా జీతాలు చెల్లించే విషయంలో వివక్షకు గురౌతున్నారని తక్కువ జీతాలు అయినప్పటికీ కాంట్రాక్టర్లు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కార్మికశాఖ పరిధిలో ఉన్నటువంటి ఈఎస్ఐ ఆస్పత్రిలో కార్పొరేషన్ డైరెక్టర్ లేకపోవడంతో ఆస్పత్రిలో పనులు సక్రమంగా జరగడం లేదన్నారు. సూపరింటెండెంట్ రాతపూర్వక హామీతో 10 రోజుల పాటు కార్మికులు తాత్కాలికంగా ధర్నాను విరమించారు. మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుకుమార్, రాష్ట్ర నాయకుడు ధన్‌రామ్, ఆస్పత్రి కాంట్రాక్ట్ కార్మికులు క్రాంతి, భాస్కర్, పద్మ, నిరంకారీ, నరసింహ, కాంట్రాక్ట్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ సునీత

గౌతంనగర్: మల్కాజిగిరి నియోజకవర్గం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని పలువురు సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ మేకల సునీత చేతులమీదుగా లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలు సీఎం రిలీఫ్‌ఫండ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జేఏసీ వెంకన్న, మేకల రాముయాదవ్, అనిల్, వాసు, రాజశేఖర్‌రెడ్డి తదితరులున్నారు.

నిధులు మంజూరు చేయండి

అల్వాల్: అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి గురువారం జోనల్ కమిషనర్ అపూర్వచౌహాన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

సీనియర్ సిటిజన్లు ఆత్మగౌరవంతో బతకాలి



గుర్తింపుకార్డులు పంపిణీ చేస్తున్న మంద సంజీవ్‌రెడ్డి

బోడుప్పల్: సీనియర్ సిటిజన్స్ తమ హక్కులతో పాటు ఆత్మ గౌరవంతో బతికేందుకు కృషి చేయాలని తెలంగాణ స్టేట్ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కా) అధ్యక్షుడు నర్సింహారావు అన్నారు. బోడుప్పల్ మారుతీనగర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లో గురువారం సీనియర్ సిటిజన్స్ గుర్తింపుకార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీనియర్ సిటిజన్స్ హక్కులకు భంగం కలిగితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వయోవృద్ధులు తమ హక్కులను గురించి తెలుసుకోవాలన్నారు. మన కోసం అనేక చట్టాలున్నాయని, వాటిని అవసరం ఉన్నప్పుడు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం బోడుప్పల్ కమిషనర్ శైలజ మాట్లాడుతూ.. సినియర్ సిటిజన్స్ ఇన్ఫోసిస్ సుధామూర్తి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని జీవించాలన్నారు. అనంతరం మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి మాట్లాడుతూ.. మీ అనుభవాలు, ఆలోచనలు భావితరాలకు చేయూతనిచ్చేలా ఉపయోగపడాలన్నారు. సీనియర్ సిటిజన్స్‌కు ఇంటర్‌నెట్, యూట్యూబ్‌లో ఎన్నో అవకాశాలున్నాయన్నారు. శరీరానికి వయస్సు, కానీ మనస్సుకు కాదనే భావనతో ముందుకెళ్లాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంద సంజీవ్‌రెడ్డి, టాస్కా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పీఎస్ఎన్ చౌదరి, బోడుప్పల్ అధ్యక్షులు బిక్షపతిగౌడ్, ప్రధాన కార్యదర్శి మంద జగన్నాథం, కోశాధికారి బ్రహ్మచారి, మాజీ కార్పొరేటర్ కొత్త దుర్గమ్మ సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్ లక్ష్మీవేంకటేశ్వర దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడోరోజు శ్రీనివాస కళ్యాణం, హనుమంతసేవ–రథోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సుదర్శన హోమం, రాత్రి పుష్పయాగం, డోలోత్సవం, దర్బార్ సేవ జరుగుతుందని ఈవో రవీందర్‌రెడ్డి, ప్రధాన అర్చకులు ముడుంబై వేంకటరమణాచార్యులు ప్రకటించారు. ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలు..

రామంతాపూర్ : గోకుల్‌నగర్‌లోని కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్చరల మధ్య బ్రహ్మోత్సవం అంకురార్పణ పుణ్యావచనం, రక్షాబంధనం వంటి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ కక్కిరేణి హరీష్, కోశాధికారి రాజశేఖర్, అవినాష్ చార్యులు, రాజేష్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.